క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సఫ్దార్‌నగర్, రాజీవ్ గాంధీనగర్, హరినగర్‌లో భూగర్భ డ్రైనేజీ, సీసీరోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం కార్పొరేటర్ సబిహా బేగం ఈ పనులను పరిశీలించారు. స్థానికులు పనులను పరిశీలిస్తూ ఉండాలని దగ్గరుండి పనులు నాణ్యతగా చేపట్టేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ హమీద్, అబ్దుల్ సలీం, షాహిద్, మీర్జా అసలాం బైగ్, మస్తాన్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి నాగ మల్లేశ్వర్



బచ్చు నాగ మల్లేశ్వర్‌కు గులాబీకండువా కప్పుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీలో బీజేపీ సీనియర్ నాయకుడు బచ్చు నాగ మల్లేశ్వర్‌తో పాటు 60 మంది బీజేపీ నాయకులు పార్టీకి రాజీనామా చేశారు. సోమవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఆయన గులాబీ కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్, కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేస్తున్న అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్ పార్టీలో చేరామని నాయకులు తెలిపారు. మతాలకు, కులాలకు చిచ్చులు పెట్టడం తప్ప బీజేపీ రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కోఆర్డినేటర్ సతీష్ అరోరా, కార్పొరేటర్ మండడి శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన

బాలానగర్: రాజీవ్‌గాంధీ నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న వీడీసీసీ రోడ్డు పనులను బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ ఏఈ మొహమ్మద్ రషీద్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డివిజన్ అభివృద్ధికి నిర్విరామంగా కృషి చేస్తున్నామన్నారు. డివిజన్ పరిధిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎమ్మెల్యే సహకారంతో ప్రతి పనికి నిధులు కేటాయించి డివిజన్ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి ఎన్‌కే నరేష్, నాయకులు కృష్ణమూర్తి, మొహమ్మద్ సోఫీ, షేక్ అరబ్, ఎండీ మొయిజ్, స్థానికులు ఎండీ యూసఫ్, లాలూ, షాదుల్లా, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాములు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి



గాయత్రినగర్‌లో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ గాయత్రినగర్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నిధులతో సీసీరోడ్డు నిర్మాణ పనులను కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.25లక్షలతో గాయత్రినగర్‌లో సీసీరోడ్డు పనులను ప్రారంభించామన్నారు. కూకట్‌పల్లిలో అభివృద్ధి పనులను ఇప్పటికే 90శాతం పూర్తి చేశామని తెలిపారు. మిగిలిన పనులన్నీ దశలవారీగా పూర్తి చేస్తామన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ శివప్రకాష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సూర్య, రవీందర్‌రెడ్డి, ముత్యం, కిషోర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని బాలాజీనగర్ కాలనీ విజయదుర్గ సెంటర్ వద్ద డ్రైనేజీ పైపులైన్ల పనులు, యోగిత అపార్టుమెంట్ వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం కార్పొరేటర్ పగుడాల శిరీషా బాబూరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీవాసుల అభ్యర్థన మేరకు డ్రైనేజీ లైన్లు ప్రారంభించామన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ వైష్ణవి, మధు, శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ బాబూరావు, నాయకులు వెంకటేష్ చౌదరి, ఎట్టయ్య, సుభాష్ గౌడ్, రమణ, సురేష్ గౌడ్, రవీందర్ రెడ్డి, ఆరోగ్యరెడ్డి, జశ్వంత్, లలిత, శారద, తదితరులు పాల్గొన్నారు.



బాలాజీనగర్ కాలనీలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శిరీష

సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దా

- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- మూసాపేటలో 80శాతం పనులు పూర్తి చేశాం
- మూసాపేట డివిజన్‌లో ఉత్సాహంగా పాదయాత్ర



మూసాపేట డివిజన్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుపై పూలవర్షం కురిపిస్తూ స్వాగతం పలుకుతున్న మహిళలు

మూసాపేట: ఒకప్పుడు కూకట్‌పల్లి నియోజకవర్గంలో వర్షాలు వస్తే కాలనీలు నీట మునిగేవని.. అలాంటి నియోజకవర్గాన్ని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో సమస్యలు లేని కూకట్‌పల్లిగా తీర్చిదిద్దామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఇప్పుడు ఎంత వర్షం వచ్చినా వర్షపునీరు రోడ్లపై నిల్వకుండా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. సోమవారం మూసాపేట డివిజన్ పరిధిలోని భరత్‌నగర్ ఈడబ్ల్యూఎస్, శక్తినగర్, మహేశ్వరినగర్, లచ్చయ్య నగర్, అంబేడ్కర్‌నగర్, బాబూజగ్జీవన్ రామ్ నగర్ కాలనీల్లో స్థానిక మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు.

◆ 22రోజులుగా గల్లీ గల్లీ తిరుగుతున్న

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై 22 రోజులుగా పాదయాత్ర చేస్తున్నామన్నారు. పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. వారికి అందుతున్న సంక్షేమ పథకాలు, కాలనీల్లో జరిగిన అభివృద్ధి గురించి తనకు వివరిస్తున్నారని తెలిపారు. అభివృద్ధి జరుగుతుందనే ప్రజలు స్వచ్ఛందంగా బయటకు వచ్చిన హారతి ఇస్తూ, పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలుకుతున్నారని పేర్కొన్నారు. ప్రజల నుంచి వస్తున్న ఈ స్పందన తనకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. మరింత ఉత్సాహంగా నియోజకవర్గాన్ని ఇంకా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు.మూసాపేట డివిజన్‌లో ఇప్పటికే 80శాతం సమస్యలను పరిష్కారం చేశానన్నారు. మిగిలిన వాటిని కూడా త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు.

◆ దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఇళ్లు ఇస్తాం

మూసాపేట గ్రామం, కాలనీ ప్రారంభం నుంచి ఉన్న డ్రైనేజీ, మంచినీటి లైన్లను జనాభాకు అనుగుణంగా నిర్మించామన్నారు. ప్రాధాన్యతా క్రమంలో డివిజన్‌లోని ప్రతి కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. పార్కులు, శ్మశానవాటికలను సైతం ఎంతో అభివృద్ధి చేశామన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న పెన్షన్లను కూడా మార్చిలోగా అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. డబుల్ బెడ్‌రూమ్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి దశలవారీగా ఇళ్లు ఇస్తామన్నారు. అంబేడ్కర్‌నగర్‌లో తాగునీటి ట్యాంక్‌ను తన సొంత నిధులతో నిర్మించి బహుమతిగా ఇస్తానని స్థానికులకు మాట ఇచ్చారు.

◆ గెలిపించి రుణ తీర్చుకుందాం: మాజీ కార్పొరేటర్

అనంతరం మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ... డివిజన్‌లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లటతో వెంటనే నిధులు మంజూరు చేసి పనులను పూర్తి చేశామన్నారు. ఇలాంటి ఎమ్మెల్యే మనకు దొరకటం ఎంతో అదృష్టమని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో మూడోసారి మాధవరం కృష్ణారావు అధిక మెజార్టీతో గెలిపించి వారు చేసిన అభివృద్ధికి రుణం తీర్చుకుందామని అన్నారు. పాదయాత్రకు ఎంతో ఆదరణ లభిస్తోందని మూడోసారి ఆయన విజయం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులతో పాటు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పాదయాత్ర అనంతరం ప్రగతి నివేదన సభ

మూసాపేట డివిజన్ పరిధిలోని మారుతినగర్, మూసాపేట ఓల్డ్ విలేజ్, యాదవబస్తీ, జిల్లా బస్తీ, చైతన్య బస్తీ, మూసాపేట 4వ బ్లాక్‌లలో పాదయాత్ర ఉంటుందని డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటలకు జనతానగర్‌లో ప్రగతి నివేదన సభ ఉంటుందన్నారు. స్థానిక ప్రజలు, కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు.



మూసాపేటలో స్థానిక మహిళలతో కలిసి పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే



ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలుపుతున్న వృద్ధురాలు

అధికారంలోకి రాగానే సమస్యలన్నీ పరిష్కరిస్తాం

బీజేపీ కార్యవర్గ సభ్యుడు గజ్జల యోగానంద్



పాదయాత్రలో పాల్గొన్న గజ్జల యోగానంద్, నాయకులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ ఆర్పీనగర్‌కాలనీలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గజ్జల యోగానంద్ సోమవారం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా గడప గడపకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అబద్ధపు హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ పార్టీ ఇంత వరకు ఏ పథకాలను సక్రమంగా అమలు చేయలేకపోయిందన్నారు. లక్షకు పైగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చి 10వేల ఇళ్లు కూడా నిర్మించలేదన్నారు. అదే విధంగా దళిత బంధు విషయంలో కూడా మోసం చేసిందని ఆరోపించారు. ఆ పథకం బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు తప్ప ప్రజలకు అందడం లేదన్నారు. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని ఇప్పటికీ చేయలేదన్నారు. త్వరలో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింగ్‌రావు, విద్యాకల్పన, ఏకాంత్‌గౌడ్, శ్రీహరి యాదవ్, మనోజ్, భాస్కర్‌రెడ్డి, ముత్యాలు, జితేందర్, గణేష్‌గౌడ్, మార్ల శ్రీను, రమేష్, భూపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించండి.. ప్రాణాలు కాపాడుకోండి

- బేగంపేట ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు
- రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించి క్షేమంగా ఇంటింటికి వెళ్లాలని బేగంపేట ట్రాఫిక్ శిక్షణ కేంద్రం ఏసీపీ శంకర్‌రాజు ప్రజలను కోరారు. సోమవారం ఓల్డ్ బోయిన్‌పల్లిలోని సెయింట్ అంద్రూస్ హైస్కూల్‌లో టీటీఐ సిబ్బంది కృష్ణ, ప్రసాద్, హీరోమోటర్ కాప్ శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్‌పై ఏసీపీ అవగాహన కల్పించారు. స్కూల్, కాలేజీ విద్యార్థులు, డ్రైవర్స్, సిబ్బంది రాంగ్ రూట్‌లో వెళ్లడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయడం, స్టాప్‌లైన్ దాటడం, త్రిపుల్ రైడింగ్‌లు చేసి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు.
అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జరుగుతున్న ప్రమాదాలను విద్యార్థులకు కళ్లకు కట్టినట్లు చూపించారు. ముఖ్యంగా మైనర్లకు వాహనం నడపడానికి ఇవ్వడం చట్టం దృష్టిలో నేరమన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువత డ్రైవింగ్ లైసెన్స్ పొందిన తర్వాతనే వాహనాలను నడపాలన్నారు. వాహనాలకు ఫిట్‌నెస్, ఇన్సురెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్స్ అవసరమని చెప్పారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని కోరారు. ట్రాఫిక్ అవగాహన సదస్సులో పాల్గొన్న 250 మంది విద్యార్థులు తమ సందేహాలను ఏసీపీని అడిగి తెలుసుకున్నారు. అవగాహన కల్పించిన ఏసీపీ శంకర్‌రాజుకు పాఠశాల ప్రిన్సిపాల్ సరోజ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ సిబ్బంది, బస్సు డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.



ఏసీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యార్థులు

డివిజన్‌లో 90శాతం పనులు పూర్తి చేశాం

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని చక్రధరికాలనీ, కాకతీయనగర్, వెంకటపాపయ్యనగర్, ఉజ్జయిని మహంకాళి నగర్‌లో సోమవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పాదయాత్ర చేశారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో అభివృద్ధి పనులన్నీ దాదాపు 90శాతం పూర్తి చేశామన్నారు. కాలనీలో కొంతమేర పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, సీసీరోడ్ల పనులను త్వరగా పూర్తి చేస్తామన్నారు. కొన్ని కాలనీల్లో విద్యుత్ వోల్టేజీ సమస్య ఉందని కాలనీవాసులు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. అధికారులతో మాట్లాడి సమస్యను త్వరలో పరిష్కరిస్తామన్నారు. బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రావణి, యూబీడీ నాగరాణి, వాటర్‌వర్క్స్ రవీందర్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎంటమాలజీ సూపర్‌వైజర్ డి.నరసింహులు, వీధిలైట్లు సూపర్‌వైజర్ నరేష్, డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో చేపట్టిన పాదయాత్రలో పాల్గొన్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

బస్తీ భరోసా యాత్రకు విశేష స్పందన

ఓల్డ్ బోయిన్‌పల్లి: డివిజన్ కొనసాగుతున్న బస్తీ భరోసా యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించడం ఆనందంగా ఉందని టీపీసీసీ సభ్యులు గొట్టిముక్కల వెంగళరావు, సత్యం శ్రీరంగం, దండుగుల యాదగిరి అన్నారు. డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జున యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం మల్లికార్జుననగర్ కాలనీ మైసమ్మ దేవాలయం నుంచి హెచ్‌ఏఎల్ కాలనీ, గౌరినగర్ కాలనీ, ఆర్‌ఆర్ నగర్, మల్లికార్జుననగర్ రోడ్డు 5వ వరకు పర్యటించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేద, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరుణ్ రెడ్డి, కిరణ్‌గౌడ్, గోపిశెట్టి రాఘవేందర్, తూము వేణు, తూము సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



గడపగడపకు కరపత్రాలు పంచుతున్న కాంగ్రెస్ నాయకులు

మహిళా సమైక్య గ్రూపుల సభ్యులతో సమావేశం

కూకట్‌పల్లి: బాలాజీనగర్, కేపీహెచ్‌బీ, మూసాపేట, కూకట్‌పల్లి, అల్లాపూర్ డివిజన్లకు చెందిన మహిళా సమైక్య గ్రూప్ సభ్యులతో సోమవారం శేషాద్రినగర్ కమ్యూనిటీహాల్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో నిరుపేదలకు అందుతున్న సంక్షేమ పథకాలను అసలైన లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. కూకట్‌పల్లిలో గతంలో 10వేల పింఛన్లు ఉంటే 9 ఏళ్ల కాలంలో ఆ సంఖ్యను 32వేలను పెంచి మొత్తం 42వేల మందికి అందిస్తున్నామని అన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల సర్వే జరుగుతోందని తెలిపారు. ఇది పూర్తయిన తరువాత లబ్ధిదారులకు విడతల వారీగా అందరికీ అందజేస్తామన్నారు. నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు వంటి మౌలిక సదుపాయాలు గత పాలకుల పాలనలో ఎలా ఉండేవో ప్రస్తుతం ఎలా ఉన్నాయో పోల్చి చూసుకోవాలని తెలిపారు.

చిన్నారులను గ్యాడ్జెట్స్‌కు దూరంగా ఉంచాలి

మాదాపూర్: పిల్లలను ఆటలలో ఆసక్తి కలిగేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్‌రంజన్ పేర్కొన్నారు. సోమవారం మాదాపూర్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన ఫ్లిప్డ్ స్టార్టప్ యాప్‌ను బ్యాడ్మింటన్ మాజీ క్రీడాకారుడు, బ్యాడ్మింటన్ జాతీయ కోచ్ పుల్లెల గోపీచంద్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జయేశ్‌రంజన్ మాట్లాడుతూ... పిల్లలను వీలైనంత వరకు గ్యాడ్జెట్స్‌కు దూరంగా ఉంచాలని తెలిపారు. శారీరక, మానసిక ఎదుగుదలకు అవసరమయ్యే క్రీడల పట్ల ఆసక్తి కనబరిచేలా ప్రోత్సహించాలన్నారు. ఫ్లిప్డ్ యాప్ పిల్లల రోజువారీ యాక్టివిటీలను మానిటరింగ్ చేస్తుందని ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

మారథాన్ ఉద్యోగుల్లో 'ఆప్టమ్' టాప్

సాక్షి, సిటీబ్యూరో: మారథాన్ ఈవెంట్‌లో అత్యధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్న సంస్థగా నగరానికి చెందిన ఆరోగ్య సేవల సంస్థ ఆప్టమ్ నిలిచింది. దీంతో సంస్థకు గరిష్ట ఉద్యోగుల భాగస్వామ్యంకు గాను ప్రత్యేక ట్రోఫీని నిర్వాహకులు అందజేశారు. ఆప్టమ్ నుంచి 1005 కంటే పైగా ఉద్యోగులు పాల్గొనగా, వీరిలో 841 పురుషులు, 164 మహిళలు ఉన్నారు. తమ ఉద్యోగులలో ఆరోగ్య స్పృహకు ఈ భాగస్వామ్యం అద్దం పడుతుందన్నారు.

గెలిపిస్తే శేరిలింగంపల్లిని మరింత అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా మూడోసారి అరెకపూడి గాంధీకి టికెట్ కేటాయించిన సందర్భంగా సోమవారం క్రిస్టియన్లు, పలు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో విచ్చేసి గజమాలతో సత్కరించి, బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ..తనపై నమ్మకముంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా మరింత బాధ్యతతో రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ముచ్చటగా మూడోసారి భారీ మెజార్టీతో గెలిచి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టడానికి కృషి చేస్తానని తెలిపారు. తన వెన్నంటే నిలిచిన నియోజకవర్గ ప్రజలు, పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో రూ.9వేల కోట్ల నిధులతో అభివృద్ధి చేశానని పేర్కొన్నారు.



శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి శుభాకాంక్షలు తెలిపుతున్న క్రిస్టియన్లు

మార్కులతో పాటు క్రమశిక్షణ అవసరం

బాలానగర్: జేఎన్‌టీయూ యూనివర్సిటీలోని జేఎన్ ఆడిటోరియంలో 2023–24 సంవత్సరంలో యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలలో వివిధ డిపార్టుమెంట్‌లలో చేరిన విద్యార్థులకు సోమవారం ఓరియంటేషన్ ప్రోగ్రామ్ జరిగింది. ఈ సమావేశంలో వీసీ డా. కట్టా నర్సింహారెడ్డి, రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్, రెక్టార్ డా. గోవర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ డా. నర్సింహారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా. విజయకుమార్ రెడ్డి, సీఆర్‌సీ చైర్మన్ డా. పార్వతి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

◆ ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ డా. జీవీ నర్సింహారెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అకడమిక్ రెగ్యులేషన్ విషయం ఎలా ఉంటుందో వివరించారు. విద్యార్థులు ఎంత హాజరు అవసరం, ఎన్ని క్రెడిట్ వస్తే మరో సెమిస్టర్‌కు ప్రమోట్ అవుతారో వివరించారు. 75 శాతం హాజరు తప్పనిసరి అని అన్నారు. రెండు నెలలకు ఒకసారి విద్యార్థుల తల్లిదండ్రులు యూనివర్సిటీకి వచ్చి పిల్లల ప్రవర్తన గురించి తెలుసుకోవాలన్నారు. ఎలా చదువుతున్నారనే విషయంలో బాధ్యతగా ఉండాలన్నారు. విద్యా విధానంలో మార్పులు వచ్చిన కారణంగా విద్యార్థి తన చదువు ఓ సంవత్సరం పాటు పోస్ట్‌పోన్ చేసుకొని తిరిగి రెగ్యులర్ స్టూడెంట్‌గా చదువు సాగించవచ్చన్నారు. మార్కులతో పాటు క్రమశిక్షణ కూడా చాలా అవసరం అని తెలిపారు.



ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌లో మాట్లాడుతున్న వీసీ డా. కట్టా నర్సింహారెడ్డి

అక్రమంగా కట్టిన గోడతో ఇబ్బందులు



మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్ విజ్ఞాన జ్యోతి హైస్కూల్ లైన్‌లో రోడ్డు ఆక్రమించుకొని ఓ ఇంటి యజమాని గోడ నిర్మించటంతో స్థానికులకు ఇబ్బందిగా మారింది. ఇటీవల నూతనంగా రోడ్డు వేయడానికి సిద్ధంగా ఉన్నా, అక్రమంగా నిర్మించిన గోడ అడ్డు రావటంతో దానిని తొలగించాలని సోమవారం గాయత్రినగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు జీహెచ్‌ఎంసీ అధికారికి వినతిపత్రం అందజేశారు. అధికారులు స్థలాన్ని పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పి.సంజీవరెడ్డి, సభ్యులు చారి, రవీందర్, ఎం.శివరాజ్ త్రిపాఠి, షేక్ హుస్సేన్, పీరా చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దలను గౌరవించాలి.. తల్లిదండ్రులను ప్రేమించాలి

- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మోతీనగర్: నాటి మానవ సంబంధాలు ఎంత దృఢంగా బలంగా ఉండేవని.. నేటి మానవ సంబంధాలు డబ్బుతో ముడిపడి ఉన్నాయని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. శాంతా వసంత ట్రస్టు యువభారతి సాహిత్య సంస్కృతి సంస్థ ట్రస్టు వజ్రోత్సవాల సందర్భంగా సోమవారం శ్రీమద్రామాయణం, మానవ సంబంధాలుపై సాహితీ ఉపన్యాస కార్యక్రమం జరిగింది.

◆ మోతీనగర్‌లోని శ్రీశృంగేరి శారద శంకర మఠం ఆవరణలో సోమవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో చాగంటి కోటేశ్వరరావు ప్రసంగించారు. సమాజంలో ఉత్తమ మానవ సంబంధాలు మెరుగుపడినప్పుడే ధర్మస్థాపన జరుగుతుందన్నారు. గురువులను పూజించాలని.. తల్లిదండ్రులను ప్రేమించాలని.. పెద్దలపట్ల గౌరవంగా ఉన్నప్పుడే మనిషికి గుర్తింపు లభిస్తుందన్నారు.

◆ నేడు ఎక్కడ చూసినా.. ఎవరి చేతిలో చూసినా స్మార్ట్‌ఫోన్లు, ఇళ్లలో పెద్దపెద్ద టీవీలకు బానిసలై మానవ సంబంధాలను మరిచిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకు మానవ సంబంధాలు క్షీణించిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శాంతా బయోటెక్ చైర్మన్ వరప్రసాద్, అధ్యక్షుడు ఫణీంద్ర, కార్యదర్శి జీడిగుంట వెంకట్రావు, కోశాధికారి రవీంద్ర, వ్యవస్థాపక సమావేశకర్త వంగపల్లి విశ్వనాథం, సమాజకర్త పత్రి అశ్వినీకుమార్, వజ్రోత్సవ సమన్వయకర్త నాగేశ్వరరావు, శంకరమఠం పరిపాలనాధికారి సీఎస్ఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



శృంగేరి శారద శంకర మఠం ఆవరణలో జరిగిన సాహితీ ఉపన్యాసానికి హాజరైన భక్తులు



ప్రవచనం చేస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న నిర్వాహకులు